# ప్రేమ! భోజన ప్రేమ!

-పోడూరి కృష్ణకుమారి

మోగుతున్న ఫోనందుకుని "హలో" అన్నాడు గుర్నాథం.

"ఓరి! నువ్వట్రా రాజారావ్! ఏమిటి విశేషాలు?" అంటూ ఓ పావుగంట కబుర్లకోసం సెటిలయ్యాడు. ఎడం చేత్తో పుస్తకం పట్టుకుని కుడి చేత్తో రిమోట్ పట్టుకుని చకచకా ఛానెళ్ళు మారుస్తున్న మాలతి చెవులు రిక్కించింది ఇటువైపు కబుర్లు తనూ విందామని. అవతల రాజారావు చెబుతున్న మాటలేవో వింటూ మొహం మాడ్చుకున్నాడు గుర్నాథం.

"ఓహో" అన్నాడు అనాసక్తిగా.

"వెరీగుడ్" అన్నాడు నిర్వేదంతో.

"హార్టీ కంగ్రాట్స్" అని కూడా అన్నాడు గుండె చెరువైపోతున్న వాడికిమల్లే.

"మెనీ హాపీ రిటర్న్స్. ఆల్ ద బెస్ట్ విషెస్సూ" అని కూడా అన్నాడు క్షణక్షణానికి పిచ్చి ముదిరి వరదై అందులో దిక్కు తోచకుండా మునిగిపోతున్నవాడికిమల్లే.

'మాటలో భావం మొహంలో కనబడదేం చెప్మా' అనుకుంటూ అయోమయంగా చూసింది మాలతి గుర్నాథంవైపు.

"సరేలేరా మర్చిపోం. ఇందులో చెల్లెమ్మకి ప్రత్యేకంగా చెప్పేదేముందిలే నేను చెప్తా. వస్తుందిలే. ఇద్దరం కలసి తప్పకుండా వస్తాం" అని భారమైన నిట్టూర్పుతో ఫోను పెట్టేసాడు గుర్నాథం.

మాలతికి ఒళ్ళు మండిపోయింది. కసాపిసా కొరికేసేదానిలా కొరకొరా చూసింది గుర్నాథం వైపు. అతను విషాదంగా మొహం పెట్టుకుని మళ్లీ ఫోనెత్తాడు. (అంటే రిసీవర్ మాత్రమే ఎత్తాడన్న మాట, మొత్తం ఫోను కాదు) ఎత్తి నెంబరు కొట్టాడు. కొట్టి "ఒరేయ్ బకం! నాకిప్పుడే రాజారావు ఫోను చేసాడురా" అన్నాడు ఏడుపుగొంతుతో.

అవతల నుంచి కూడా ఇలాంటి ఏడుపే వినబడింది కాబోలు "నీకూ చేసాడూ?" డగ్గుత్తికతో అని అవతల ఆ బకం చెప్తున్న మాటలు వింటూ నిట్టూరుస్తూ గద్గదస్వరంతో "ఏం చేస్తాం తప్పదు. ఈ జన్మకింతే" అని విషాదపులుకులు పలికి ఫోను పెట్టేసాడు.

"మేటరేదో సీరియస్సే" అనుకుని సోఫాలో గుర్నాథం పక్కన కూర్చుని "ఏంటండీ ఏం జరిగింది? ఎవరికైనా సీరియస్సా" అనడిగింది కాస్త భయంగా.

"సీరియస్సే?" అన్నాడు గుర్నాథం సీలింగ్ కేసి చూస్తూ.

"రాజారావన్నయ్యగారికా?"

"ఆ.. రాజారావన్నయ్యకే" గుర్నాథం గొంతులో వెటకారం వ్యంగ్యం కలగలిసినట్టను మానం వచ్చింది.

"ఏమయింది అన్నయ్యగారికి? మరి మీరు కంగ్రాట్స్ గట్రా అంటున్నారేంటి?"

"అవునన్నాను. అనకపోతే మనకి మేనర్స్ లేవనుకోడా ఆ వెధవ!"

"ఏమిటీ డొంక తిరుగుడు?" మాలతికి చిర్రెత్తుకొచ్చింది. సర్రున లేచింది. "చెప్పేదేదో సరిగ్గా చెప్పండి. ఆయనకి సీరియస్‌గా ఉంటే కంగ్రాట్స్ ఏమిటి? మేనర్స్ ఏమిటి" "సీరియస్సు రాజారావు గాడికి కాదు నాకు?"

మాలతి పరమ సీరియస్‌గా చూసింది. "ఏం? మీకేం వచ్చింది? సుబ్బరంగా ఉన్నారు నా కళ్లకి" అంది కోపంగా.


"అదే ఏనాడు నీ ముందు తలొంచుకుని పెళ్లి చూపుల్లో కూచున్నానో ఆ క్షణాన్నే పడ్డాయి నీ దిష్టి కళ్లు. అందుకే నా బతుకిలా అయిపోయింది" గొల్లుమన్నట్లు సౌండ్స్ చేసాడు గుర్నాథం.

మాలతికి కొంచెం నవ్వొచ్చి కొంచెం ఒళ్ళు మండింది. మేటరు మరీ సీరియస్ కాదన్నమాట ఇతనిలా వేషాలేస్తున్నాడంటే. మౌనంగా ఫోనందుకుని బకం నెంబరు కొట్టింది.

"హలో" అన్నాడు బకం అని ముద్దుగా పిలవబడే బలరాం కందుకూరి.

"ఏంటండీ అన్నయ్యగారూ! ఇందాక రాజారావన్నయ్యగారి దగ్గర నుంచి ఫోనొచ్చినప్పటి నుంచీ మా ఆయన కంటికీ మంటికీ ఏకధారగా ఒకటే ఏడుపు. ఏమిటి విశేషం?" అడిగింది.

"ఏం చెప్పనమ్మా? ఏం చెప్పను? ఎలా చెప్పనమ్మా? ఎలా చెప్పను? నా నోటితో నేను చెప్పలేనమ్మా. చెప్పలేను. అయినా గుండె దిటవు చేసుకుని చెప్తానమ్మా. చెప్తాను. వాడికి ఆ దుర్మార్గుడికి మళ్లీ పెళ్లటమ్మా" ఎఫెక్ట్ కోసం కొంత గ్యాప్ ఇచ్చాడు.



మాలతి ఓ క్షణం అవాక్కయింది. "అదేంటి?"

"అంతేనమ్మా మరి. సంప్రదాయం. షష్టిపూర్తి నాడు మళ్లీ పెళ్లి చేస్తార్టగా?" బకం ఫోను పెట్టేసాడు.

మాలతి నవ్వాపుకుని కోపంగా గుర్నాధంవైపు తిరిగింది.

"మీ ఇద్దరికీ ఇదేం వికృతానందం. ఆయనకి షష్టిపూర్తి అయితే మీకెందుకూ అంత ఏడుపు? పైగా ఆయనకి సీరియస్సుట సీరియస్సు"

"వాడికేం వాడు నిత్యపెళ్లికొడుకు. మేమే నిత్య పేషెంట్లం. అందుకే ఈ ఏడుపు?"

మాలతికి ముందు నవ్వొచ్చి తరువాత జాలేసింది. గుర్నాధాన్ని బిపి, షుగరు, కొలెస్ట్రాల్ అనే త్రిమూర్తులూ ఆవహించి ఉన్నారు. గుర్నాధం మిత్ర బృందంలో అందరికీ ఆ మూడు కాకపోయినా వాటిల్లో ఒకటో రెండో ఉన్నాయి ఒక్క రాజారావుకి తప్ప. పైగా వీళ్లందరూ మహా భోజనప్రియులు. అదీ ఏడుపు. రాజారావు అన్ని రుచులూ ఆస్వాదించుకుంటూ సుష్టుగా తింటాడు. అత నింట్లో శుభకార్యం అయితే షడ్రుచులూ, పిండివంటలూ, సూడిదల పేరంటంలా కనీసం తొమ్మిదిరకాల స్వీట్లూ ఇలాంటి ఆర్భాటాలు తప్పవు. వీళ్ళు మింగలేరు, మింగకుండా ఉండలేరు. బాధ కక్కలేరు. మాలతి సోఫాలో సాములారిలా కూచుని గొంతు సవరించుకుంది.

"చూడండి. మనం తిన్నన్నాళ్లూ తిన్నాం, ఆస్వాదించాం. ఆనందం అనుభవిద్దాం. ఇంక చాల్లే అని దేవుడు చిన్న ఆనకట్టేసి తిండి సన్యాస యోగం ప్రాక్టీస్ చేయమన్నాడు. ఏం



చేస్తాం? చేద్దాం. అసలే రుచీ తెలీనివాళ్లం కాదుగా!'' ఉద్బోధించింది.

"అదేకదా బాధ?'' గుర్నాథం భోరుమన్నాడు.

***

అదిరిపడుతూ ఎదురుచూసిన రోజు రానేవచ్చింది. వీళ్ళు వెళ్లనూ వెళ్లారు. బక్కపల్చటి బకం వచ్చాడు. సన్నగా పుల్లలా ఉన్నా, బకాసురుడిలా బండెడు లాగించెయ్యగల సత్తా ఉంది అతనికి. గుండ్రాయిలా ఉండే పుల్లారా వొచ్చాడు. ఎప్పుడూ తిండి తిననట్లు ఏం పెట్టినా ఆబగా లాగించేసే ఆనంద రావొచ్చాడు. అలాంటి ప్రత్యేకతలే వున్న ఫ్రెండ్సంతా కలసి ఓ అరడజను మంది వచ్చారు. ఊళ్లో మిగతా ఆహ్వానితులు కాక, వీళ్లందరూ కలసి వాళ్లూరి కాలేజీలో బియ్యేలూ, బీకాంలు చదివే రోజుల్లో వీళ్లకి బీపీ గ్రూప్? అని మూకుమ్మడి నిక్ నేముండేది. అంటే ఆ వయసులో వీళ్ళు బ్లడ్‌ప్రెషర్ రోగిష్టు లని కాదు. వీళ్లకి రకరకాల వంటలంటే ఉన్న అనురాగాన్ని గమనించి 'భోజన ప్రియుల గ్రూప్ అని బృందనామం పెట్టి ముద్దుగా బిపి గ్రూప్ అని వ్యవహార నామం పెట్టారు. ఆ పేరు సార్థకం చేసుకుంటూ విద్యార్థి జీవితం జల్సాగా గడి పేసారు మనవాళ్ళు.

ఇప్పుడివాళ్ల అరవైలో ఆ ఇరవైల వాటి జిహ్వా అలాగే కంటిన్యూ అవు తున్నా ఆరోగ్యం సహకరించకపోవడంవల్ల రాజారావు షష్టిపూర్తి వీళ్ల దుఃఖాని కొచ్చింది. అక్కడి ఏర్పాట్లు, ఆ వైభవం చూస్తూ చూస్తూ చూడలేక గుడ్ల నీళ్ళు కుక్కుకుంటున్న వీళ్లని చూసి ఆ కన్నీళ్లన్నీ ఆనందభాష్పాలు కామోస నుకున్నారు తెలీనివాళ్ళు. అయితే రాజారావు ఆహారంతోపాటు ఆరోగ్యం ఏర్పాట్లు కూడా చేసాడు. అతని పెద్దకొడుకు కార్డియాలజిస్ట్. చిన్నకొడుకు చక్కెర వ్యాధి నిపుణుడు (డయాబిటాలజిస్ట్). పెద్దకోడలు డైటీషియన్, చిన్న కోడలు బ్యూటీషియన్. కూతురు సైకోథెరపిస్ట్. అల్లుడు ఫిజీషియన్. ఆరుగు రినీ అందరికీ పరిచయం చేసాడు రాజారావు.

"ఇంక మీ ఇష్టంరా. మా పిల్లల సహాయ సహకారాలు తీసుకుని మీరేమేం తినొచ్చో తిని ఎంజాయ్ చేయండి'' అన్నాడు.

గుర్నాథానికి ఒళ్ళు మండిపోయింది. "ఏమిటి ఎంజాయ్ చేసేది నా బొంద. డాక్టర్లనడిగితే తినమంటారా మాడమంటారుగానీ'' అన్నాడు ఉక్రో షంగా.

"ఉడుక్కోకురా బాబూ. మా పిల్లలు నువ్వనుకున్నంత రాక్షసులేం కాదులే'' అన్నాడు.

"రండి అంకుల్. మీకెందుకు. మీరేమీ వర్రీ కాకండి'' అంటూ పిల్లలుగా పిలువబడ్డ డాక్టర్లు వీళ్లందర్నీ చేతులు పట్టుకు లాక్కెళ్లారు.

ఒకళ్ళు బరువు తూచారు. మరొకళ్ళు కాలరీలు లెక్కలు కట్టారు. ఇంకోళ్ళు గుండె చూసారు. ఒకోళ్లకీ ప్రిస్క్రిప్షన్లు ఎడాపెడా రాసేసారు. ఆ చీటీలు పుచ్చుకుని మనవాళ్ళు ఉత్సాహంగా బఫేలోకి చొరబడ్డారు. డైటీషి యన్ కోడలు వీళ్లతోపాటు వచ్చి వెయిటర్స్‌కి చీటీలో రాసున్న విషయాలు వివరించింది. గుర్నాథానికి అర జిలేబీ, పావు కోవా, పావు జాంగ్రీ, ఒకటిలో ఎనిమిదోవంతు బూరె, పదహారోవంతు గారె, అంత పాయసం, ఇంత పులి హోర, అర పుల్కా, పిసరంత కుర్మా దక్కాయి.

మిగిలినవాళ్లక్కూడా అలాగే ఎవరి ప్రారబ్దాన్నిబట్టి వాళ్లకి వడ్డించారు. వాళ్ళు పెట్టిన ఏడుపు మొహాలు చూసి జాలిపడ్డారు వెయిటర్లు.

"దీంతో కడుపునిండినట్టే'' అన్నాడు గుర్నాథం డైటీషియన్ కోడలువైపు తిరిగి.

"అంకుల్! మీరు హాయిగా కడుపునిండా తినాలంటే ఇలా రండి'' అని దారి తీసింది.

మిత్రులంతా పాలోమని ఆ పిల్ల వెనకాలే పడిపోయారు. లాన్స్‌లో ఏర్పా టుచేసిన రెండో సెక్షన్‌లోకి ప్రవేశించారు. అక్కడ అందంగా అమర్చిపెట్టిన పదార్థాలెంతో ఆకర్షణీయంగా అందరినీ దగ్గరకు పిలిచాయి. పిలువందుకుని వెళ్లినవాళ్ళు వెలవెలపోయారు. మనసులోనే వలవలమన్నారు. అక్కడున్న పదార్థాల దగ్గర వాటిపేర్లు రాసిపెట్టిన చిన్న చిన్న అట్టముక్కలున్నాయి. 'పాయసం-షుగర్ ఫ్రీ', 'కొవ్వులేని వడ', 'పచ్చి కూరలతో పరమాన్నం', 'ఆకు కూరలతో అద్భుతాలు', 'నూనెలేని బజ్జీలు', 'తవుడుతోపాటు అన్నం' ఇలా తగలడ్డాయి.

"పేర్లు చూసి భయపడకండంకుల్. నిజానికి మీ ఆరోగ్యానికి ఇవెంతో మంచివి''ప్రోత్సహించింది డైటీషియన్.

ఎవరూ మాట్లాడలేదు. మౌనంగా మళ్లీ మొదటి సెక్షన్‌వైపు కదిలిపో యారు. ప్రిస్క్రిప్షన్లు చింపి పడేసి ఒక్కరోజుకి మహా మిన్ను విరిగి మీద పడొ చ్చిందా ఏమన్నానా అనుకుంటూ కావలసినవన్నీ వేసేసుకుని లాగించేయడం మొదలుపెట్టారు. డాక్టర్లు, డైటీషియన్లు చిన్నగా నవ్వుకుని తప్పుకున్నారు. గుర్నాథం అర్ధనిమీలిత నేత్రాలతో హల్వా రుచి ఆస్వాదిస్తుండగా మాలతి

## ఇలా చేయండి!

★ కళ్లక్రింద కొంతమందికి ఉబ్బుతుంది. ఆ సమయంలో బంగాళా దుంప సగానికి కోసి దానితో ఉబ్బిన చోట రాస్తే ఉబ్బు తగ్గుతుంది.

★ కాళ్ల పాదాలు మండుతుంటే గుమ్మడికాయ గుజ్జు రాయాలి.

★ పెరుగు నుంచి వెన్న తీసేటప్పుడు చింతపండు నీళ్లల్లో చెయ్యి ముంచి వెన్న తీస్తే చేతికి జిడ్డు అంటుకోదు.యాపిల్స్, క్యారెట్స్ వేరువే రుగా నిలువ చెయ్యాలి. లేకపోతే క్యారెట్స్ చేదెక్కుతాయి. అరటి ఆకుల్లో వుంచితే ఇడ్లీలు, దోశెలు పులిసిపోవు.

★ గాజుగాజులను వేడినీళ్లల్లో ముంచి చల్లారిన తర్వాత ధరిస్తే త్వరగా పగలవు. ఫ్రైడ్‌రైస్ తయారీలో నూనెలో కొంచెం పంచదార వేస్తే మంచి బ్రౌన్‌కలర్ వస్తుంది.


★ బియ్యంలోనూ, పప్పుల్లోనూ పురుగులు చేరకుండా ఆముదం గింజలు వేయాలి. ఇడ్లీ పప్పు నానబెట్టినప్పుడు కొన్ని మెంతులు వేస్తే రుచిగా ఉంటాయి ఇడ్లీలు, దోశెలు.

★ నల్లనువ్వులు బాగా నమిలి తింటే దంతాలు గట్టిపడతాయి. వెంటనే చల్లనినీరు తాగాలి. నిమ్మరసం కాళ్లకు రాస్తే కీళ్లనొప్పులు, మంటలు తగ్గు తాయి. ఆరుగ్రాముల వాము నిత్యం తింటే కిడ్నీలో రాళ్ళు కరిగిపోతాయి.

★ నీటిపొక్కులు నోటిలో వస్తే టమోటాని తింటే తగ్గుతాయి.

★ జామకాయలు ఎక్కువగా తిన్నట్లు అన్పిస్తే జీలకర్ర మెత్తగా నూరి చెంచాడు తినాలి. అజీర్తి మటుమాయం అవుతుంది.

-అనూరాధ



అతని పక్కకొచ్చి నిలుచుంది. గుర్నాధం అటువైపు తిరిగిపోయి ఎవర్నో అప్పుడే చూసినట్లు నటించేస్తూ హడావుడిగా పలకరించి అటు రెండడుగులు వేసాడు. మాలతి అనుసరించింది. మాలతివైపు చూడకుండా మొహం తిప్పు కుని మరో వడ, ఆవడా కూడా వేసేసుకున్నాడు. అతను భోజనం ముగించి తాంబూలం బిగించేవరకూ ఓపిగ్గా నుంచుంది మాలతి.

"ఒక్కసారిలా రండి" అంది.

ఇలా వచ్చిన గుర్నాధం "వచ్చా. ఏం కొడతావా? డాక్టర్లు వద్దన్నవన్నీ జన్మకో శివరాత్రిలా ఒక్కపూట తృప్తిగా భోజనం చేసినందుకు కొడతావా?" అన్నాడు గుసగుసగా కసికసిగా బుసబుసలాడుతూ.

"అబ్బా!ఏంటా పిచ్చిమాటలు? ఊర్కోండి. రండి మీకోటి చూపిస్తా" సున్నితంగా గుర్నాధం చెయ్యి పట్టుకుని మందుకు నడిచింది. రెండో సెక్షన్ బఫేవైపు తీసుకెడుతూ "రండన్నయ్యగారూ! మీకూ తమాషా చూపిస్తా" అని మిగతా మిత్రుల్ని కూడా పిలిచింది. అందరూ కుతూహలంగా మాలతిని ఫాలో అయ్యారు.

అక్కడ ఆ రెండో బఫేలో ఆనందరావు కూతురూ, అల్లుడు, బకం తాలూకు ఇద్దరు కూతుళ్లు, రాజారావు కొడుకులు, కూతురూ, కోడళ్లూ, అల్లుడు ఇంకా మిగతా మిత్రుల వారసులు ఇంకా ఎవరెవరో తెలీని పిల్లలు చాలామంది ఉన్నారు. అందరూ టీనేజ్ నుంచి నలభై లోపు వాళ్లే. అంతా కలసి కబుర్లు చెప్పుకుంటూ 'పంచదార లేని పాయసం, ఆకుకూరల అద్భుతాలు' గర్రా ప్లేట్లలో నింపుకుని మహదానందంగా తింటున్నారు.

"నేను లాస్ట్ మంత్ రెండు కేజీల బరువు పెరిగిపోయా తెలుసా? అమ్మో అప్పట్నించీ మళ్లీ కంట్రోల్లోకొచ్చేసా" అంటోంది డైటీషియన్.

"నాకీ సలాడ్స్ చాలా ఇష్టం" పరవశంగా కళ్ళు మూసుకుని లాగించేస్తూ అంటున్నాడు కార్డియాలజిస్ట్.

అలాంటి డైలాగులే వేస్తున్నారు మిగిలినవాళ్ళు కూడా. గుర్నాధం తన కళ్లనీ, చెవులనీ తనే నమ్మలేకపోయాడు. 'రాళ్లు తిని అరిగించుకోవలసిన వాళ్ళు వీళ్లిలా నీళ్ల మజ్జిగలూ, ఆకులూ అలములూ తిని కడుపులు నింపుకు న్నారా? "ఏం బాబూ! ఏమిటీ మీకందరికీ జబ్బా? ఏమిటి మీ తిళ్ళు?" అన్నాడు కాస్త హాస్యంగా, కాస్త కుతూహలంగా, మరికాస్త ఉక్రోషంగా.

"అంకుల్! ఈ జాగ్రత్త జబ్బులొకుండా" అన్నాడు కార్డియాలజిస్ట్. "ఇంక మేమూ నలభయోపడికి దగ్గర పడుతున్నాంకదా. ఇప్పటినుంచే జాగ్రత్తగా ఉంటే అరవైలో కూడా ఇరవై లెవెల్లో ఆరోగ్యం కాపాడుకోవచ్చు అని ఈ జాగ్రత్త" అని వివరించారు అక్కడ చేరిన మిగతా కుర్రాళ్ళు, కుర్రపిల్లలు.

"చూసారా! మనకంటే మన తరువాతి తరం వాళ్లెంత తెలివైనవాళ్లో" అన్నట్లు చూసింది మాలతి భర్త వైపు.

గుర్నాధం తదితరులు మొహమొహాలు చూసుకున్నారు. వీళ్లకెవరికీ ఈ కుర్రాళ్ల పద్ధతేం మింగుడుపడలేదు.

"జబ్బొచ్చాక ఎలాగూ తప్పదు. ఇప్పట్నించే ఈ శిక్ష ఎందుకురా?" అంటూ సానుభూతి ప్రకటించాడు.

"ఇది జబ్బులు రాకుండా ఉండేందుకే అంకుల్. అయినా ఇది మేం శిక్ష అనుకోవడంలేదు" అన్నారు కుర్రాళ్లంతా ముక్తకంఠంతో.

బకం విషాదంగా ముఖం పెట్టుకుని వాదనలోంచి విరమించి నిష్క్రమిం చాడు. మిగతావాళ్ళు అతన్ని అనుసరించారు.

గుర్నాధానికి ఈ కుర్రాళ్ల వరస బొత్తిగా మింగుడుపడలేదు.

"ఏమైపోతున్నారీ కాలం కుర్రాళ్ళు. రుచులే తెలీని వెర్రోళ్ళు" అంటూ ఆవేశంగా ఓ కవిత్వం కూడా చదివి మిత్రబృందానికి కాలేజీ రోజులు గుర్తుకొ చ్చేలా చేసాడు. అంతా ఒప్పేసుకున్నారు.

"అబ్బే మనరోజులే వేరు. మన రుచులు, అభిరుచులే వేరు. తిండి పుష్టి ఉండాలన్నా కూడా రసికత ఉండాలండీ. దానికీ దీనికీ లంకే మరి" అని లెక్చరు దంచాడు బకం తను మహా పరమ రసికుడిలా ఫోజు కొట్టుకుంటూ.

యధాప్రకారం మాలతికి ఒళ్ళు మండిపోయింది. "మీ గోల మీది మిమ్మ ల్నెవరూ మార్చలేరు. వాళ్లకి తిండి పుష్టి లేకపోవడమేకాదు, మీకు తిండియావ ఎక్కువైంది. వయసుతోపాటు రోగాలూ పెరుగుతున్నా కంట్రోల్ చేసుకోలేక వాళ్లని అంటున్నారు. మీరంతా వాళ్లని చూసి నేర్చుకోవాల్సినదెంతో ఉంది" అంది.

గుర్నాధం అండ్ కో మొహమొహాలు చూసుకున్నారు. అన్నీ తెలిసిన విజ్ఞు డిలా నవ్వాడు గుర్నాధం.


"ఎంతైనా తల్లి కదా పిల్లలెంత ఎదిగినా పాపం పిల్లల్లాగే కనిపిస్తుండడం వల్ల వాళ్లనేమైనా అంటే తల్లి గుండె తట్టుకోలేకపోతోందర్రా. ఆవిడ మాటలు పట్టించుకోకండి. ఆవిడ తరఫున నేను సారీ చెప్తున్నా" అన్నాడు చాలా ఉదా రంగా.

మాలతి గుర్రుగా చూసి అక్కడినుంచి వెళ్లిపోయింది. గుర్నాధం విజయ



## మల్లికా సౌరభం

'ది మిత్' చిత్రంలో నటించిన మల్లికా షెరావత్ ఇప్పుడు చాలా బిజీగా ఉంది. ఆ చిత్రం ప్రీమియర్ కోసం టొరాంటో వెళ్లిన మల్లికా ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన తనకి ఎంతో ఆనందాన్ని ఇచ్చిందంటోంది. అందాన్ని ఆరబోసే ఆమె దుస్తులు ఆ ప్రీమియర్ షోలో స్పెషల్ అట్రాక్ష న్‌గా నిలిచాయట. నవంబర్‌లో ఇండియాకి రానున్న జాకీచాన్ పర్యటన గురించి ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ పర్యటన ఆమెకి మరిన్ని అవకాశాలకి నాంది కాగలదని భావిస్తున్నారు.



గర్వంతో నవ్వుకున్నాడు.

షష్టిపూర్తి మహోత్సవం అంతా పూర్తయ్యాక ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు గుర్నాథం ఏదో ప్యాకెట్ కార్లో వెనుక సీట్లో ఓ మూలపెట్టి దానిమీద నాప్‌కిన్ పడేయడం చూసి కూడా చూడనట్లు ఊరుకుంది మాలతి. అదేమిటో ఆమాత్రం ఊహించగలిగిందిగానీ మాట్లాడలేదు. ఇంట్లోకెళ్లాక నాప్‌కిన్ పట్టుకొస్తున్నట్లు నటిస్తూ దాని చాటున ప్యాకెట్ పట్టుకొచ్చి దాన్ని భద్రంగా తన కంప్యూటర్ దగ్గర మినీఫ్రిజ్‌లో దాచడం కూడా చూసింది. మౌనంగా పెరట్లో కెళ్లి నిలబడింది. గుర్నాథం జిహ్వాచాపల్యం కంట్రోల్ చేసుకోలేకపోవడం గురించి బాధపడుతూ ఆలోచించింది. ఇవాళ ఒక్కరోజు తిన్నాడని కాదు, ఈ వారం అంతా ఆ మాటకొస్తే ఈనెలంతా కూడా ఏవేవో పెళ్లిళ్ళు, పెళ్లిరోజులు, బారసాలలూ లాంటివేవో ఫంక్షన్లు చాలా వున్నాయి. ఇవాళ తిన్నట్లే ఈనెలంతా తింటే రోగాలు తిరగబెట్టి బాధపడేది అతనే. ఆలోచిస్తూ నుంచున్న మాలతి చూపులు పెరట్లో ఆడుకుంటున్న పిల్లలమీద పడ్డాయి. పనిమనిషి కుటుంబం పెరట్లో వున్న ఔట్ హౌస్‌లో వుంటున్నారు. వాళ్ల పిల్లలతో కలసి ఆడుకోవడానికి చుట్టుప్రక్కలున్న బిల్డింగుల్లో వాచ్‌మెన్‌ల పిల్లలూ, ఇంకా వర్కర్ల పిల్లలు వస్తుండడం పరిపాటి. ఇప్పుడిలాగే చాలామంది పిల్లలు పెరట్లో ఆడుతూ అంతా కలసి నానా హడావుడి చేస్తున్నారు. ఆ పిల్లల్ని అలా చూస్తుంటే మాలతికి బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. గబగబా లోపలికెళ్లింది. గుర్నాథం దాచిపెట్టిన ప్యాకెట్ తీసింది.

"ఒక్కసారి అర్జెంటుగా పెరట్లోకి రండి" అని గుర్నాథాన్ని పిలిచి పెరట్లోకి పరుగుతీసింది.

"అబ్బ...ఈవిడకేం వచ్చినా హడావుడే. నా ప్రాణాలు తీస్తుంది" అని విసుక్కుంటూ కాళ్లీడ్చుకుంటూ పెరట్లోకి చేరాడు.

"ఓ పిల్లలూ!" అని కేకేసి పిల్లల్ని పిలిచింది మాలతి. పిల్లలంతా బిలబిలమంటూ వచ్చారు. "చూడండి పిల్లలూ! ఇవాళ ఈ అంకుల్ పుట్టినరోజు. మీకందరికీ స్వీట్లు పంచిపెడతామంటున్నారు. తీసుకోండి" అంది.

పిల్లలందరూ "హేపీ బర్త్‌డే అంకుల్‌గోరూ" అంటూ గుర్నాథాన్ని ఘెరావ్ చేసారు.

మాలతి పొట్లం గుర్నాథం చేతిలో పెట్టి కానివ్వండి అంది. గుర్నాథం మొహం ముటముటలాడించుకుంటూ పిల్లలందరికీ జిలేబీలు, కోవాలు, జాంగ్రీలు వగైరా వగైరా పంచి పెట్టేసి కోపంగా గిర్రున వెనక్కి తిరగబోయాడు. ఎవరో తన చెయ్యి పట్టుకు లాగినట్లయి ఆగి చూసాడు.

"అంకుల్!ఈ స్వీట్ పేరేంటే బలే బావుంది. ఇలాంటిది నేనెప్పుడూ తిన్లా. ఎంత బావుందో" అంది కొరికినంత కొరగ్గా చేతిలో మిగిలిన మూడు రంగుల బర్ఫీ ముక్కని చూపిస్తూ ఓ మూడేళ్ల పసిది. బర్ఫీ ముక్క ఎత్తి పట్టుకుని పరమ సంతోషంగా తన మొహంలోకి చూస్తున్న ఆ పిల్ల చింపిరి జుట్టూ, మాసిన గౌనూ, నోటినిండా లాలాజలంతో కరిగిన బర్ఫీ ముద్దతోసహా ముద్దొచ్చేసింది స్వతహాగా పిల్లలంటే ముద్దన్న గుర్నాథానికి.

"దాన్ని బర్ఫీ అంటారమ్మా" అన్నాడు పసిదాన్ని దగ్గరకు తీసుకుని.

"మరి అదేంటీ?" మళ్లీ అడిగింది. చిన్నది. ఇంకో పిల్ల చేతిలోది చూపిస్తూ.

"అదీ బాదుషా" అన్నాడు.

"మరి అదో?"

"అది పాలకోవా, అది జాంగ్రీ, అది జిలేబీ, అది కజ్జికాయ, ఇది కోవాకజ్జికాయ, ఇది లడ్డు, అదేమో బందరులడ్డు" అంటూ ఆ పిల్ల అడగకముందే ఒక్కోదాని పేరు చెప్పేసాడు.

"మరయితే మీరు రోజూ ఇలాగే పుట్టినరోజు సేసుకోరాదా అంకులయ్యగోరూ?" అంది సిసింద్రీ.


"ఎందుకూ?"

"మరి ఇయ్యాలే బర్పెలాగుంటదో తెలిసింది. మరా లడ్డెలాగుంటదో అదేదో అజంగిరీ ఏదో అదీ, ఆ లడ్డూ ఇంకా ఆ ఎర్రదీ ఆపచ్చదీ అల్లాంటియన్నీ ఎలాగుంటయో తెలవాల్నంటే అయ్యగారంకులుగోరూ. మరి మీర్రోజూ పుట్టిన్రోజు సేసుకుని రోజుకోరకం నాకు పెడితేనే గందా తెలిసేది?" అంది సీమ్మిరపకాయ్.

పక్కలో టపాకాయ్ పేలినట్లు ఉలిక్కిపడ్డాడు గుర్నాథం.

"ఏ రుచి ఎలా వుంటుందో తెలీని పిల్లలు, తెలుసుకునే అవకాశం కూడా కరువైన పసివాళ్ళు ఇంతమంది ఉండగా అన్ని రుచులు తెలిసీ తినకూడదని కూడా తెలిసి ఆబగా నేను ఎగబడి తినడమేమిటి? తింటే ఇలాంటి పిల్లలు తినాలి. ఆనందిస్తారు. అదీగాక అరిగించుకోగలరు కూడానూ. అసలు నేనెంత మూర్ఖుడ్ని" అని గుర్నాథం అనలేదు. అతని కళ్లల్లో కదిలిన పల్చటి కన్నీటి పొరలో ఆ భావం చదివింది మాలతి.

★



## బుద్ధిమంతుడు

పుట్టినరోజు వేడుక ఎవరికైనా అంతులేని ఆనందాన్ని ఇస్తుంది. ఈసారి జరిగిన తన పుట్టినరోజు ఎంతో మధురమైనది అంటున్నాడు అక్షయ్‌కుమార్ ఆనందంతో. ఈ పుట్టినరోజు నాడు అక్షయ్‌కుమార్‌కి చెందిన 'కిలాడీ' చిత్రం ఆరంభమైంది. అలాగే 'గరం మసాలా' చిత్రం షూటింగ్‌ని పూర్తిచేసుకుని జనం ముందుకి వస్తోంది. ఈ చిత్రంలో జాన్‌అబ్రహాం, పరేష్ రావల్, రాజ్‌పాల్‌యాదవ్ తదితరులు నటిస్తున్నారు. గర్ల్‌ఫ్రెండ్స్‌తో తిరగకుండా బుద్ధిగా సినిమాలు చేస్తున్న అక్షయ్‌ని చూసి అంతా ఆశ్చర్యపోతున్నారట.

